# 31. సిద్ధాంతం

"రేపు మళ్ళీ వాళ్ళొస్తారు - ఏం చెప్పమంటావ్?" శర్మ తలయెత్తి తండ్రివైపుచూసి, మాట్లాడకుండా ఊరుకున్నాడు. "పిల్లనుకూడా చూసివొచ్చాక, వాయిదాలు వేస్తూ వాళ్ళను మనచుట్టూ తిప్పుకుంటూంటే ఏం బాగుంటుందీ?"

కాస్త ఆగి తండ్రి మళ్ళీ అందుకున్నాడు: "అట్లా మూగనోము పడితే ఏం లాభం? ఆ పిల్లను నువ్వు మొదటినుంచీ ఎరుగుదువాయె! ఐనా బాధ్యత తెలిసిన యీడులో విషయాన్ని తేల్చుకోగలవాడివి కదా - తేల్చి అటో ఇటో చెప్పేందుకు అనుమానిస్తావ్ దేనికి?"

"మరో వరుణ్ని చూసుకోమను-" అన్నాడు శర్మ.

"ఇదివరకు వచ్చిన ఐదారు సంబంధాల్నీ ఇల్లాగే చేశావాయె. నీకు ఆ పిల్లలో కన్పించే లోటేమిటి?" అన్నాడు తండ్రి కోపంగా.

ఇదేప్రశ్నతో శర్మ గత సంవత్సరంనుంచీ బాధపడుతున్నాడు. కాని తను నమ్మిన విషయమూ, తను కనిపెట్టిన సిద్ధాంతమూ ఇతర్ల చెవినవేసి వారిని ఒప్పించటం కష్టమని తెలిసే - యీ మౌనాన్ని ఎన్నుకున్నాడు.

"ఒక్కగాని ఒక్కడివి - నీకు యీ పట్టుదల ఏమిటో చెప్పకూడదా? వెధవ చదువులు చదివి కుటుంబాన్ని కూడా లెక్క చెయ్యకుండా...ఖర్మ!...ఖర్మ!" దుఃఖంతోనూ, కోపంతోనూ కూడిన కంఠంతో మాటలురాక బాధపడుతున్నాడు ముసలితండ్రి.

శర్మ ఆ స్థలంలో ఇంకొక్క క్షణంకూడా నిలవలేక పొయ్యాడు. హృదయాన్ని భాషలో చెప్పలేక బాధపడటమేమిటో అతనికి అర్థమైంది, వెనుక గొణుగుతూన్న తండ్రినికూడా లెక్క చెయ్యకుండా చప్పున లేచి వీధిలో పడ్డాడు.

జీవితంలో తానెందుకు ఇంత బాధపడాలి? ఏడాది క్రితం జీవితపథంలోని ముళ్ళకంపలమీద కాలువెయ్యటం మొదలు పెట్టాడు; ఆ దారి తిరిగేట్టులేదు. కాలుతీసి మంచిదోవను వెయ్యటం కూడా తెలియదు. పోనీ ఇతరులు తనకు ఏ విధమైన సానుభూతిని చూపటమన్నాకూడా భరించలేక పోతున్నాడు.

గడిచిన రోజులు జ్ఞాపకమొచ్చినై. తనూ అరుంధతీ గాఢంగా ప్రేమించుకోవటమూ, హృదయాల్ని విప్పి చెప్పుకొనే భాషా జ్ఞానం లేక బాధపడటమూ, ఇద్దరూ కలిసి చేసుకున్న వాగ్దానాలూ, వివాహానంతరం తాము నిర్మించుకొన్న ఆదర్శజీవితపు మధురతమక్షణాలు - వాటిని ఎలా మరిచి పోగలడు? ఆ గాలిమేడలన్నీ నేలమట్టమయినై. లోకం గుర్తించగల విలువగల వ్యక్తివచ్చి ఆమెను - తనదనుకొని భ్రమపడ్డ అరుంధతిని జీవితాంతం వరకూ స్వంతం చేసుకున్నాడు - తానేమీ చెయ్యలేక గుడ్లు మిటకరించి చూస్తూండటం గుర్తుంది. కాని అది తన తప్పుకాదేమో? ఎవరి తప్పయినా ఆనాటినుంచే ఆమెను మరిచిపోలేక, జీవితంలోని ఇతర సమస్యల్ని కూడా గుర్తించుకోలేక, నిర్ణయంలేక బాధపడుతూ ఇతర్లకుకూడా బాధ కలిగిస్తున్నాడు.

ఈ సొదంతా తండ్రి విని ఎలా ఆమోదిస్తాడు? ఆత్మతో ప్రేమించిన తన అరుంధతి స్థానాన్ని - వేరొకతెకు ఎలా ఇవ్వగలడు? లోకం కోసం ఆ పశుత్వాన్ని మాత్రం ప్రదర్శిస్తూ ఆ దాంపత్యాన్ని ఎలా సాగించగలడు? తన ఆశయాన్ని నిర్మూలించుకొని ముందు జీవితాన్ని - వెనుకటి రోజుల్ని మరిచిపోతూ...గడపటం కూడా సాధ్యం కాదేమో?

అందుకనే వివాహమంటే తనకంత ఏవగింపు. తన వెంటపడి, తన మీదనే యీ భారాన్ని మోపుతూన్న వాళ్ళకు అర్థమౌతుందా - తన హృదయంలోని యీ కనపడని గాయపుబాధ!

రైల్వేస్టేషన్‌కు వెళ్ళాడు, ఉత్సాహంతో అక్కడ గుమికూడిన ప్రయాణీకుల్ని చూసి తనుకూడా లేని ఉత్సాహాన్ని కల్పించుకుందామని! ఆ ప్లాటుఫారంమీద నాలుగైదుసార్లు పచారుచేశాడు. సంతోషంతో, ఆతృతతో ఆ రాబొయ్యే రైలుకోసం పట్టాలవైపు చూసే అనేక వింతవింత ముఖాలు - వీళ్ళల్లో ఒక్కళ్ళకూ తన లాటి భీకర సమస్య లేదు కాబోలు!

ప్లాటుఫారంమీద చివర ట్రంకుమీద కూర్చొని నోటిదాకా పమిటను కప్పుకున్న స్త్రీని చూడగానే అతను ఆశ్చర్యపడ్డాడు. అరుంధతీ ఇక్కడెందుకుంది! తను

పొరపడుతున్నాడేమో? తనకు అనేకసార్లు అవకాశమిచ్చినా ముద్దాడని ఆ విశాల ఫాలభాగం ఆమెదే!

ఆమె దోమల్ని తోలేందుకు ఒకక్షణం తొలగించిన ముసుగు అతని అనుమానా లన్నింటినీ పారతోలింది. వెంటనే ఆమెదగ్గరకు వెళ్ళి, 'అరుంధతీ!' అన్నాడు. పోయిన విలువైన వస్తువు ఆశలన్నీ వొదులుకున్నాక దొరికినప్పటి సంతోషంలాటిది ఆ పిలుపులో వుంది.

ఆమె మాట్లాడకుండా వింతగా అతని వైపు చూస్తోంది.

"గుర్తులేనా?" అన్నాడు మెల్లిగా.

'నువ్వెవరు?' అన్నట్టుచూసి, హాస్యాస్పదంగా నవ్వింది.

"అరుంధతీ!" అన్నాడు మళ్ళీ ఆమె వింతప్రవర్తనను లెక్క చేయకుండానే.

ఆమె కదలలేదు, మెదలలేదు. పిచ్చివారికి సానుభూతి చూపేట్టుగా అతనివైపు చూసింది. ఆ చూపులోని ఏవగింపూ, అయిష్టతా, ఎదుటివ్యక్తిని తృణీకరించేభావమూ – అన్నీకలిపి అతని కోపాన్నీ, ఆ కోపం చేతకానితనాన్ని నిరూపించేందుకు వెలువడే దుఃఖాన్నీ రేకెత్తింప జేసినై.

ఇంతలో రైలు వొచ్చింది. ఒక బలిష్ఠమైన యువకుడు చకచకావొచ్చి ఆ ట్రంకును తీసుకొని ఆమెతోపాటు రైలెక్కాడు. ఆమె కిటికీలో నుంచి తీరిగ్గా శర్మవైపు 'నువ్వింకా ఇక్కడే వున్నావా?' అన్నట్లు చూసింది.

"అరుంధతీ!" అన్నాడు, ప్రమాదం వెన్నాడుతూన్నప్పుడు ఉపయోగించే కంఠంతో.

"ఎవరూ?" అన్నాడు బలిష్ఠకాయుడు.

"ఎవరో లెద్దూ–" అంది ఆమె, శర్మనుకాని, అతని పోలిక మనుషుల్ని కాని ఆమె జీవితంలో ఇంతవరకూ చూడనట్టు.

రైలు బయలుదేరింది. పట్టాలమీద శబ్దం చేస్తూ సాగిపోతూన్న రైలువంక అతను నిశ్చేష్టుడై చూడసాగాడు. అరుంధతి తనను గుర్తించలేదా? ఏమయినై ఆ ప్రేమపూరిత వాగ్దానాలు? ఆమె కోరిన దేహసౌఖ్యాన్ని తను తృణీకరించి, జీవితాంతం వరకూ దేహాలు వేరైనా తమ ఆత్మలు ఒకటేనని తీర్మానించుకోవటమూ అతనింకా మరిచిపోలేదు. కలలోగూడా తనను చూడనట్టే నిరాదరించింది – విశ్వాస ఘాతకురాలు!

వేణు చకచకా పరుగెత్తుకొచ్చి శర్మభుజం తట్టుతూ "రైలు వొచ్చినప్పుడు నువ్విక్కడే వున్నావా?" అన్నాడు.

స్నేహితుడి ముఖంలోకి వింతగాచూస్తూ, "ఏం – ఎందుకూ?" అన్నాడు.

"అరుంధతి యీ బండిలో ఎక్కిందా?"

"ఏం?" అన్నాడు.

వేణుకాస్త అనుమానించి "ఆమె ఎవడితోనో లేచిపోయిందని వాళ్ళ వాళ్ళు వెతుకుతున్నారు-" అన్నాడు.

శర్మకు బుర్ర తిరిగినట్టయింది - ఇటు తనూకాక, అటు ఆమె భర్తాకాక - ఆ మూడోవాడు ఆమెను తీసుకుపోవటం అతనికి భరించరానిదైంది.

తన బాధను మరుగుపరుస్తూ, వేణుతో, "లే-దు" అని బొంకాడు - ఇది ఇంకా తను ఆమెకు విధిగా చూపాల్సిన కృతజ్ఞతగా భావిస్తూ.

వేణు వెళ్ళిపొయ్యాక - ఆలోచనతో శర్మ ఉక్కిరిబిక్కిరవ్వసాగాడు. ఆమెను - ఆ కులటను తనెందుకు పట్టివ్వకూడదు? తనను విషక్రిమిలాగ చూసిన ఆమెకేనా తను దయ చూపాల్సింది? వెంటనే వెళ్ళి వేణుతో చెప్దామనుకున్నాడు. కాని సమయం మించిపోయింది.

తను కలలోకూడా అనుకోని విషయం - అరుంధతి లేచి పోవటమా? నిజంగా తనే ఆమె భర్తయివుంటే - అపకీర్తి, యీ బాధ తన నెత్తిన పడేది! ఆమెను కత్తికొక కండగా కోస్తే పాపం వుందా?

ఏమయిందీ ఆమె ప్రేమంతా? ఆమె తనను అసలు ప్రేమించలేదనే విషయాన్ని తను ఏవిధంగానూ నమ్మలేడు. మరి యీ సంవత్సరంలోనే తనను పూర్తిగా ఎల్లామరిచి పోగలిగింది? తను అనుకున్నట్టు తన కోసం బాధపడుతూ ఆమె జీవితాన్ని సాగించనేలేదు. చేతికందినంతవరకూ తన సౌఖ్యాన్ని ఎక్కడా వదిలిపెట్టకపోవటాన్ని నేర్చుకుంది! తనకు బాగా అర్థమైందని భ్రమించిన అరుంధతి - ఇంతగా ఎలా మారిపోయింది?

దారినపోతూ మళ్ళీ ఆలోచించసాగాడు - ఆమె జీవితంలో సంవత్సరం గడిచింది. మార్పులు జరిగినై! మనస్తత్వమంతా ఎదురుతిరిగింది - పెద్దలే సీతాకోక చిలుకల్లాగ, వాతావరణాన్ని పట్టి రంగు మార్చుకుంటూ వుంటే - అరుంధతి ఒక లెక్కా? ఇది తనకు మంచి సమాధానంగా తోచింది. తన జీవితంలో కూడా రోజు తరువాత రోజు బాధతోనే గడిచిపోతోంది-అదంతా తను అరుంధతిని పూజిస్తూ కల్పించుకొన్నదే! ఈనాడు తనను గొంగళీపురుగులాగు ఎదిరించిన అరుంధతిని పట్టుకొని వేళ్ళాడుతూ తను ఇంకా బాధపడటంలో అర్థం లేదేమో? ఆమెకోసం తను తన ఆనందాన్ని బలివ్వటంమాత్రం దేనికి?

భోగం బజార్లో తమకిక వ్యవధిలేనట్టు విటులు చకచకా నడిచిపోతున్నారు. తను ఇన్నాళ్లూ తృణీకరిస్తూన్న దేహ సౌఖ్యానికేనా ఇంతమంది సిద్ధమవటం? ఆ కొత్తవ్యక్తుల్తో, భేదించిన సంస్కారంగల మనుష్యుల్తో - ఒకరాత్రి కాపరాన్ని చేసి

ఆనందించటాన్ని ఎలా నేర్చుకున్నారు - వీళ్ళందరూ?...శోభనంనాటిరాత్రి గదిలోకి పంపబడిన వధూవరులు తామెంత కొత్తవారయినా, ఒకరిని చూసి ఒకరు తమ పరిస్థితుల్ని ఎలాగో మార్చుకొని - ఏళ్ల తరబడి హాయిగా కాపరం చేసుకుంటూన్న దంపతుల్ని గూర్చి తను ఇన్నాళ్ళూ ఎందుకు ఆశ్చర్య పడలేదు? అసలు అరుంధతి ఇలా చెడిపోతుందని తను కనీసం ఊహించుకొనివుంటే - ఆమెకు ఆ తుచ్ఛ దేహసౌఖ్య సిద్ధాంతాన్ని బోధించి ఉండేవాడు కాదేమో? శర్మకు బుర్రతిరిగి పిచ్చెత్తినట్టయింది. తను రెండురోజుల క్రితం వెళ్ళి చూచొచ్చిన పెళ్ళికూతురు కాబొయ్యే యువతి గుర్తొచ్చింది - ఆమె అందమంతా తనను యీక్షణంనుంచే ఆహ్వానిస్తూన్నట్టు తోచింది-

వెంటనే ఇంటిదారి పట్టాడు. తల్లి తలుపు తీయగనే, "ఆ సంబంధాన్ని స్థిరపరచమని నాన్నతో చెప్పు-" అని సిగ్గు పడుతూ, మార్చుకున్న తన సిద్ధాంతాన్ని మెచ్చుకుంటూ, గదిలో చొరబడ్డాడు.

*- మే, 1941*